క్లుప్తంగా

కల్లూరులో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని స్థానిక కల్లూరులో లైఫ్ హోమియోపతి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి హోమియో వైద్యులు శిరీషారెడ్డి ఆధ్వర్యంలో విషజ్వరాల నివారణకు మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధుల గురించి డాక్టర్ హరిప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యనిర్వాహకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా హర్షవర్ధన్



కర్నూలు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) అండర్-19 జిల్లా కార్యదర్శిగా సి. హర్షవర్ధన్ ఎన్నికయ్యారు. ఆయన కర్నూ లు నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పరమేశ్వర రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశా రు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఆయ న రెండేళ్లు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

'తోకలేని పిట్ట' నవలకు బహుమతి



అతిథుల చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న పుల్లా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: జిల్లా నవలా రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు పుల్లా రామాంజనేయులు రాసిన తోకలేని పిట్ట నవలకు రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. చదువు - అన్వీక్షికి 2023 ఉగాది నవలల పోటీల్లో తోకలేని పిట్ట నవల యంగ్ అడల్ట్ ఫిక్షన్ విభాగంలో రూ.5000 బహుమతిని పొందింది. హైదరాబాద్ ప్రసాద్ సినిమా రివ్యూ థియేటర్‌లో సినిమా దర్శకులు వంశీ, నటులు, రచయిత డాక్టర్ తనికెళ్ల భరణి చేతుల మీదుగా రచయిత పుల్లా రామాంజనేయులు బహుమతిని అందుకున్నారు.

విలువిద్య సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు (టౌన్): జిల్లా విలువిద్య సంఘం చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ బి.ఎస్.ప్రవీణ్‌కుమార్, పాట్రన్‌గా డాక్టర్ సి.వాసురెడ్డిలు ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానిక సి.క్యాంపులోని టీజీవి కళాక్షేత్రంలో జిల్లా విలువిద్య సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విలు విద్య సంఘం నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షులుగా (సునీల్‌కుమార్), కార్యదర్శి (నాగరత్నమయ్య), కోశాధి కారి (మురళీమోహన్),ఉపాధ్యక్షులుగా(విశ్వనాథ్) మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు.

'వెన్నెల కురవని రాత్రి' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం ప్రముఖ కవయిత్రి స్వయంప్రభ రచించిన 'వెన్నెల కురవని రాత్రి' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ప్రముఖ కవి డాక్టర్ రాధేయ ఆవిష్కరించి మాట్లాడారు. సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు బసవరాజు, ఆర్‌యూ తెలుగు ఆచార్యులు అరుణ, విమర్శకులు నాగేశ్వరాచారి, విరసం నాయకులు పాణి, పద్యకవి పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ, గీతాముఖర్జీ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ అదనపు జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా కాలనీల్లో సీపీఐ బృందం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వారితో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ గీతాముఖర్జీ నగర్‌లో సచివాలయం, హెల్త్ సెంటర్లను నిర్మించాలని, రోడ్లను బాగు చేయాలని కోరారు. అలాగే వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రజల ఇళ్ల పట్టాలను హౌసింగ్ బోర్డులో తాకట్టు పెట్టారని, వాటిని విడుదల చేయించాలని కోరారు. 60 ఏళ్లు దాటిన వారందరికీ పెన్షన్, అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు ఆశాబేగం, నాగేశ్వరమ్మ, సోఫియా, రాముడు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శ్రావణం.. శుభకరం

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగల సమాహారంతో ఆధ్యాత్మిక శోభ
- శ్రీశైలం, ఉరుకుంద ఆలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు



ఉరుకుంద ఈరన్న స్వామి మూలవిరాట్

కర్నూలు కల్చరల్: చంద్రుడు శ్రవణా నక్షత్రానికి దగ్గరగా సంచరించే మాసం శ్రావణం. శ్రావణ మాసం సోమవారం ప్రారంభం కానుంది. ఈ మాసంలో విష్ణుమూర్తి నక్షత్ర మండలంలో కొలువుతీరి ఉండటాన నభోమాసం అంటారు. శివుడు, విష్ణువు, గౌరీ, లక్ష్మీ, చంద్రుడు, శని, ఇలా సర్వదేవతలు శుభాన్ని చేకూరుస్తారని ఈ మాసాన్ని శుభమాసం అని కూడా అంటారు. అన్నీ పూజా దినాలే కావడంతో ఇది భక్తి మాసం. హిందువులకు అత్యంత శుభకరమైంది. ఈ మాసంలో ప్రతి రోజు అత్యంత పవిత్రమైందే. అత్యధిక పండుగలను ఈ మాసంలోనే జరుపుకుంటాం. నాగుల చవితి, వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి ఇలా ముఖ్యమైన ఈ పండుగలు బంధాలు, బాంధవ్యాలను తెలుపుతాయి. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఈ నెల ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. రుతువులలో మూడోదైన వర్ష రుతువు ఈ మాసంతోనే ప్రారంభమవుతుంది. వ్యవసాయ పరంగా కూడా ఈ మాసం ప్రాముఖ్యం పొందింది. శ్రావణంలో గృహనిర్మాణాన్ని ప్రారంభించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

శ్రీశైలం దేవస్థానంలో..

శ్రీశైల మహాక్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా 5వ తేదీ నుంచి నెలంతా విశేష పూజాధికాలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రావణ సోమవారాలు, శుక్రవారాలు, శనివారాలు, ఏకాదశులు, శ్రావణ పౌర్ణమి, మాసశివరాత్రి, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో..

ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో నెలంతా శ్రావణ మాసోత్సవాలు జరగనున్నాయి. సోమ, గురువారాలు స్వామివారికి ప్రత్యేక రోజులు కావున విశేష పూజలు నిర్వహిస్తారు. నాల్గవ సోమవారం 26వ తేదీన స్వామివారికి పల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ స్వామిని సేవించే వారు ఉత్సవాలు ముగిసే వరకు మద్యపానం, మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కర్నూలు నగరంలో..

స్థానిక అరోరా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయం, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, ఓల్డ్ సిటీలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, లలితా పీఠం, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ ఆలయం, గుత్తి రోడ్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ప్రతి రోజు విశేష పూజలు చేస్తారు.

శ్రావణ మాసంలో వచ్చే పండుగలు

- శ్రావణ మాసంలో ఆచరించాల్సిన వ్రతాల్లో సోమవార వ్రతం ఎంతో విశిష్టమైంది. ఈ రోజున (5, 12, 19, 26 తేదీలు) శివుని ప్రీత్యర్థం ఉపవాసం ఆచరించడంతో మంచి ఫలితాలను పొందవచ్చని వేద పండితులు చెబుతున్నారు.
- కొత్తగా పెళ్లైన స్త్రీలు ఈమాసంలో ప్రతి మంగళవారం (6, 13, 20, 27 తేదీలు) మంగళగౌరి వ్రతాన్ని నోచుకుంటారు.
- శ్రావణ శుక్రవారాలు లక్ష్మీ పూజకు అత్యంత ముఖ్యమైనవి.
- శ్రావణ మాసంలోని మొదటి పండుగ నాగుల చవితి. దక్షప్రజాపతికి చిన్న భార్య అయిన కద్రువకు జన్మించిన సంతతే నాగజాతి. సుబ్రహ్మణ్య స్వామి ప్రతిరూపాలు. ఈ జాతిని పూజిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఇది పున్నమి ముందు అనగా శ్రావణమాసం ప్రారంభమైన నాలుగవ రోజు (8వ తేదీ) వస్తుంది.
- మరుసటి రోజు 9వ తేదీ గరుడ పంచమి. అనగా వినత కుమారుడు గరుత్మంతుడు తన తల్లి దాస్యము బాపుటకు స్వర్గానికి వెళ్లి అమృతం తెచ్చి కద్రువ సంతానమైన పాములకు పోసి దాస్య విముక్తి చేస్తాడు. గరుత్మంతుని జన్మదినమైన గరుడ పంచమి రోజున నోము నోచుకుంటారు. పార్వతీ దేవిని 'ఫణిగౌరి'తో పోల్చుకుని నోచుకొని తమ సోదరుల వద్దకు వెళ్లి వారి ఆశీస్సులు అందుకుంటారు.
- ఈ మాసంలో అతి ముఖ్యమైన పండుగ 'వరలక్ష్మీ వ్రతం'. ఆగస్టు 16వ తేదీ ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని పార్వతీ దేవికి పరమేశ్వరుడే స్వయంగా చెప్పాడని శివ పురాణం ద్వారా తెలుస్తుంది. ఈ వ్రతం శ్రావణ మాసం రెండవ శుక్రవారం వస్తుంది.
- 'శ్రావణ పూర్ణిమ'. దీనినే 'రాఖీ పూర్ణిమ' అంటారు. 19వ తేదీన రక్షా బంధన్ పండుగ జరుపుకుంటారు. ఇదే రోజు హయగ్రీవ జయంతి నిర్వహిస్తారు.
- మరో ముఖ్యమైన పండుగ కృష్ణాష్టమి. ఇది శ్రావణమాసం కృష్ణ పక్షంలో అష్టమి రోజు 26వ తేదీ వస్తుంది. శ్రీకృష్ణుడు దేవకీ, వసుదేవులకు అష్టమ గర్భంగా అర్ధరాత్రి జన్మించిన పర్వదినం. గీతాచార్యుడు అయిన శ్రీకృష్ణపరమాత్ముడి జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ఈ పండుగను అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

పరమ పవిత్ర మాసం



శ్రావణ మాసం పరమ పవిత్రం, అత్యంత శుభకరమైంది. సకల దేవతారాధనకు అనుకూలమైంది. ఈ మాసాన్ని ఆచరించడంతో స్త్రీలకు సకలసౌభాగ్యాలు కలుగుతాయి. మహిళలు ఈ మాసంలో ఉపవాసం ఉండి వివిధ రకాల నోములు, వ్రతాలు ఆచరిస్తారు. సోమవారం చేసే వ్రతాలతో అనంత పుణ్య ఫలం లభిస్తుంది. శ్రావణ పూర్ణిమ అన్న చెల్లెళ్లకు ప్రీతికరమైంది. స్త్రీలు తమ సోదరులకు రక్షాబంధనం కట్టి జీవితాంతం అండగా ఉండాలని కోరుకుంటారు. ఈ నెలలో చేసే లలితా సహస్ర నామ పారాయణం వేయింతల పుణ్య ఫలాన్నిస్తుంది.

– పి.చంద్రశేఖర శర్మ, పండితుడు

నగరంలో వర్షం



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులో ఆదివారం సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురిసింది. పట్టణం మినహా ఇతరత్రా జిల్లాలో ఎక్కడా వర్షం పడిన దాఖలాలు లేవు. సాయంత్రం 5.20 గంటల నుంచి దాదాపు 15 నిముషాలపాటు వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. ఇదిలాఉండగా గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. జూలై నెలలో 38 శాతం లోటు వర్షపాతం ఉండగా ఆగస్టులో ఇంతవరకు వర్షాలు లేవు. దీంతో రైతులు వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తలసీమియా చిన్నారులకు రక్తదానం

కర్నూలు కల్చరల్: నందమూరి మోక్షజ్ఞ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు బ్లడ్ బ్యాంక్‌లో తలసీమియా చిన్నారులకు రక్తదానం చేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు మోతిలాల్, రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది సెప్టెంబర్ మోక్షజ్ఞ జన్మదినం సందర్భంగా అప్పటినుంచి ప్రతి నెలా ఐదుగురు తలసీమియా చిన్నారులకు రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు.


ఏఐహెచ్‌ఆర్‌ఓ జిల్లా చైర్మన్ నియామకం

కర్నూలు కల్చరల్: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా చైర్మన్‌గా పత్తికొండకు చెందిన కటారుకొండ సాయికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ లీగల్ (ఐ) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రఫీ నియామక ఉత్తర్వులను ఇచ్చారు. దీంతో పాటు జిల్లా జనరల్ సెక్రటరీగా ఎం.గిరీష్, కార్యదర్శులుగా రంగన్న, గురుస్వామి, లీగల్ అడ్వైజర్‌గా మధు, సభ్యులుగా రఘు, ఖాజా హుస్సేన్, విజయ్, సురేంద్ర, సతీష్‌లను నియమించినట్లు తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరి జయంతి



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



చౌడేశ్వరి మాత

కర్నూలు కల్చరల్: ఆషాఢమాసం అమావాస్య రోజున సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మహిళా భక్తులు దీప జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు, చీర సారె సమర్పించారు. లలితా సహస్రనామ స్తోత్ర సామూహిక కుంకుమార్చన జరిగింది. మహిళా కమిటీ సభ్యులు పద్మ, స్వప్న, జయలక్ష్మి, అనురాధ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య రూపక ప్రదర్శన



నృత్య రూపకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం సౌజన్యంతో ఆదివారం రాత్రి సీ క్యాంప్‌లోని కళాక్షేత్రంలో ప్రదర్శించిన షిరిడీ సాయి బాబా నృత్య రూపకం అలరించింది. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు సాయి భక్తులచే ఈ నత్య రూపకాన్ని మొదటిసారి షిరిడీలో ప్రదర్శించడం జరిగిందన్నారు. అక్కడి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. రెండో ప్రదర్శన కర్నూలులో జరిగిందన్నారు. 120 మంది కళాకారులు సాయిబాబా జీవితాన్ని సంపూర్ణంగా ప్రదర్శించి మెప్పించారన్నారు. కళాక్షేత్రం తరఫున కార్యక్రమ నిర్వాహకులు మహాబలేష్, చింతా శ్రీనివాస్‌కు రూ.40 వేలు అందజేశారు. అంతకుముందు కూచిపూడి సిద్దేంద్ర నృత్య కళాశాల ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి, కర్నూలు నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు జ్యోతి ప్రజ్వలన చేసి నాటక ప్రదర్శన ప్రారంభించి ప్రసంగించారు.

సూర్యాలయంలో నటుడు ఆకాష్ పూజలు



సినీ హీరో పూరి ఆకాష్ జగన్నాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: నగరంలోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని తెలుగు సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు సినీ హీరో పూరి ఆకాష్ జగన్నాథ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ దంపతులు, ఆలయ పండితులు ఆకాష్‌ను శాలువాతో సన్మానించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అర్చక పండితులు వేద ఆశీర్వచనం అందించారు.

షడ్రక్ ఆశయ సాధనకు కృషి



టి.షడ్రక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం సీనియర్ నాయకుడు టి.షడ్రక్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శి టి.రాముడు పేర్కొన్నారు. ఆదివారం టి.షడ్రక్ 4వ వర్ధంతి పురస్కరించుకొని సుందరయ్య భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం పోరాడిన నేతగా టి.షడ్రక్ ప్రసిద్ధిగాంచారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీర్చలేదనిదన్నారు. షడ్రక్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని సుర్జీత్ భవన్‌లో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అధ్యక్షతన కేవీపీఎస్ కార్యాలయంలో టి.షడ్రక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముజఫర్ నగర్‌లోని టీసీ లక్ష్మమ్మ కుట్టు మిషన్ సెంటర్‌లో సీనియర్ నాయకులు కె.సుధాకరప్ప, ఇషాక్, ఎంసీ ఆనంద్, ఓబులమ్మ, దానమ్మ ఆధ్వర్యంలో షడ్రక్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు సి.గురుశేఖర్, ఆర్.నరసింహులు, మహ్మద్‌రఫీ, సుజాత, భాస్కర్, యేసు, రాజు, లోకేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



మాట్లాడుతున్న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి వీఎస్ రావు

కర్నూలు(సెంట్రల్): హయ్యర్ పెన్షన్ పొందేందుకు అర్హులైన వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐఆర్‌టీడబ్ల్యూఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రావు విమర్శించారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సుప్రీంకోర్టు తీర్పు అమలు-హయ్యర్ పెన్షన్ సమస్యలు' అనే అంశంపై ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో ఈపీఎఫ్ఓ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఫలితంగా కొందరు పెన్షన్ కోసం కనీసం దరఖాస్తు కూడా చేసుకోకుండా అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. అనేక సమస్యలను ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పెన్షన్ హక్కుల కోసం పోరాటాలకు సీఐటీయూ మద్దతు ఇస్తుందన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ కోశాధికారి జె.దివాకర్ కేరళ వయనాడ్ బాధితుల కోసం రూ.4200 విరాళాన్ని సీఐటీయూ నాయకులకు అందించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి వీఎస్ రాయుడు, నాయకులు కేసీ శేఖర్, బి.నాగరాఉ. దేవరాజు, ఎస్.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్నూలు(హాస్పిటల్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మానవత కన్వీనర్ సురేష్‌కుమార్, మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ప్రకృతి ప్రేమికులు హాజరుకండి..పర్యావరణాన్ని కాపాడుకుందాం...కేరళ వాయనాడ్ మృతులకు సంతాపం తెలుపుదామంటూ పిలుపునివ్వగా వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై క్యాండిల్ లైట్ ప్రదర్శన నిర్వహించి మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 2011లో పశ్చిమ కనుమల పరిరక్షణకు 75 శాతం ఎకో జోన్‌గా ప్రకటించాలని గాడ్గిల్ కమిటీ ఇచ్చిన నివేదికను అమలు చేయాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక, మానవత, అవోపా, ఆర్‌ఎస్‌డీఎస్ సంస్థల నుంచి యుగంధర్‌శెట్టి, శేషయ్య, రమణ, ప్రతాప్, జయంత్, తిరుపతిసాయి, విజయ్, శ్రీను, హబీబ్, రాజు, రామాంజినేయులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మార్షల్‌ఆర్ట్స్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. శారీరక శ్రమతో కూడిన క్రీడలు అవసరమన్నారు. సత్తా చాటిన విద్యార్థులకు ఆయన బెల్ట్‌లు ప్రదానం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వివిధ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వివరించారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ సెల్‌ఫోన్ నంబర్‌తో వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యలకు సత్వర పరిష్కారం తీసుకుంటామని స్పష్టం చేశారు.

డోలమైట్ లారీ పట్టివేత

కర్నూలు (టౌన్): ప్యాపిలి నుంచి హైదరాబాద్‌కు అనుమతి లేకుండా డోలమైట్ పౌడర్ తరలిస్తున్న లారీని ఆదివారం సాయంత్రం విజిలెన్స్ రాయల్టీ అధికారులు పట్టుకున్నారు. భద్రత నిమిత్తం ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏలాంటి అనుమతులు లేకపోవడంతో జరిమానా విధించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

వీహెచ్‌పీలో నియామకం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విశేష సంపర్క్ రాష్ట్ర ప్రముఖ్‌గా టి.ప్రతాప్‌రెడ్డిని నియమించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నందిరెడ్డి సాయిరెడ్డి, కాకర్ల రాముడు తెలిపారు. తిరుపతి జిల్లా వరదయ్య పాలెంలో మూడు రోజులపాటు కేంద్రీయ నాయకులు మార్గదర్శనంలో వీహెచ్‌పీ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో పలువురికి నూతన బాధ్యతలు అప్పగించారు. కర్నూలు విభాగ్ బజరంగ్ దళ్ సంయోజక్‌గా వీసుగ రాజేష్, జిల్లా అధ్యక్షుడిగా టీసీ మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షుడిగా సోమిశెట్టి సురేష్, గోవిందరాజు, కర్నూలు విభాగ్ సామాజిక సమరసత టోలి సభ్యులుగా గోరంట్ల రమణను నియమించినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కర్నూలు (టౌన్): కర్నూలు నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన నూరుల్లా, వరప్రసాద్, నరేష్, సుల్తాన్ అనే వ్యక్తులు స్థానికంగా నివసించే సుంకన్న నుంచి రూ.3.50 లక్షలు నగదు తీసుకున్నారు. బదులుగా అతని వద్ద స్కార్పియో వాహనం పెట్టారు. అయితే నకిలీ పేపర్లు పెట్టినట్లు గుర్తించిన బాధితుడు బళ్లారి చౌరస్తా సమీపంలోని హోటల్ ఇంటర్నేషనల్ వద్ద కనబడిన వీరిని డబ్బులు ఇవ్వాలంటూ అడిగాడు. దీంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. బాధితుడిని కులం పేరుతో దూషించడంతో నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

నగరంలోని గణేష్‌నగర్‌కు చెందిన హరిత అనే మహిళ శనివారం సాయంత్రం భర్త రవితేజ గౌడ్‌తో కలిసి రైతుబజార్‌కు వెళ్లింది. కూరగాయలు కోనుగోలు చేసే సమయంలో అమె మెడలోని గొలుసును చైన్ స్నాచర్ తెంపుకొని పారిపోయే ప్రయత్నం చేశాడు. అక్కడున్న వారు అప్రమత్తమై దొంగను పట్టుకుని మూడవ పట్టణ పోలీసులకు అప్పగించారు. నిందితుడు తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన గొల్ల కృష్ణగా పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

బీపీ నియంత్రణలో ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) ఉన్న ప్రతి ఒక్కరూ దానిని నియంత్రణలో ఉంచుకోవాలని కార్డియాలజిస్టు, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో హైబీపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ హైబీపీ ఎందుకు వస్తుంది, లక్షణాలు, చికిత్స, నివారణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు సన్మానించారు.